క్లుప్తంగా

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులు

కాళ్ల: మండలంలో జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం 2025 డైరీ, క్యాలెండర్లను సోమవారం కాళ్ళ ఎంపీడీఓ జి.స్వాతి ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని క్యాలెండర్, డైరీ విడదల చేశారు. కార్యక్రమంలో కార్యాలయం ఏవో ఎంఎస్ ప్రభాకర రావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, జిల్లా ట్రెజరర్ వెంకటేష్, మండల సంఘ అధ్యక్షుడు డి.సునీల్‌రాజు, ఉపాధ్యక్షుడు బి.సతీష్ కుమార్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభు శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి ఆకివీడుకు చెందిన మామిడి నాగఆంజనేయరావు, కొండా కనకరత్నం దంపతుల కుమారులు రూ.1,00,160 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్‌కు దాతలు కుటుంబ సభ్యులతో కలిసి నగదు అందించారు. దాతల కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి బాండ్ పత్రాన్ని అందించారు.

గాదిరాజు బాబుకు శాసనమండలి చైర్మన్ పరామర్శ



గాదిరాజు సోమరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోషేనురాజు, అంజిబాబు

భీమవరం: తండ్రి మరణంతో విషాదంలో ఉన్న భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు) కుటుంబాన్ని సోమవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పరామర్శించారు. బాబు తండ్రి సోమరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబును పరామర్శించిన వారిలో కోళ్ల నాగేశ్వరరావు, చెనమల్ల చంద్రశేఖర్, పాత్తూరి బాపిరాజు, బండి రమేష్ కుమార్, కారుమూరి సత్యనారాయణమూర్తి, చిలుకూరి నర్సింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

22న మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

భీమవరం: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ నిర్వహించనున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. భీమవరం పట్టణం శ్రీరాంపురంలో గాంధీ కస్తూరిబా భవనంలో ఈ నెల 22వ తేదీ నుంచి కుట్టు, ఎంబ్రాయిడరీ, శారీ పెయింటింగ్స్‌పై శిక్షణ ఇస్తారని ఆసక్తి గల మహిళలు సెల్ నంబర్ 86397 30222కు సంప్రదించాలని ప్రసాదరాజు తెలిపారు.

చీరల బహిరంగ వేలం

భీమవరం (ప్రకాశంచౌక్): గునుపూడిలో వేంచేసియున్న పంచారామ క్షేత్రం శ్రీసోమేశ్వర జనార్థనస్వామి వార్ల దేవస్థానంలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో భక్తులు సమర్పించిన వస్త్రాలు (చీరలు, పంచెలు) విక్రయించగా రూ.69,480 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. గ్రామస్తులు, భక్తుల సమక్షంలో మత్స్యపురి సమూహ దేవాలయాల కార్య నిర్వహణాధికారి ఎం.రఘునాథ్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

ఆచంటలో పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం

పెనుగొండ: నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో రూ.1.40 కోట్లతో నిర్మించిన మోడల్ పోలీస్ స్టేషన్ భవనాన్ని సోమవారం సాయంత్రం ఎస్పీ నయీమ్ అస్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో నేరాల అదుపుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఆలస్యమైనా ఆచంటలో అధునాతనమైన మోడల్ పోలీస్ స్టేషన్‌ను నిర్మించామని తెలిపారు. త్వరలో పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌కు కూడా అధునాతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, భీమవరం, తణుకు ఎమ్మెల్యేలు పులపర్తి రామాంజనేయులు, ఆరుమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్సీలు వంక రవీంద్రనాథ్, కౌరు శ్రీనివాసు, ఇళ్ల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నా.. సౌకర్యాలు సున్నా

అభివృద్ధికి నోచుకోని ఏఎంసీలు, పుంత రోడ్లు

- రైతులకు తప్పని తిప్పలు
- ఇతర అవసరాలకు అన్నదాతల సొమ్ము
- ఏళ్ల తరబడి అధ్వానంగా పుంత రోడ్లు
- నిరుపయోగంగా మార్కెట్ యార్డులు



అధ్వానంగా ఉన్న పుంత రోడ్డులో తిరగబడ్డ గడ్డి ట్రాక్టర్(ఫైల్)



చిట్టడవిని తలపిస్తున్న ఆకివీడు వ్యవసాయ మార్కెట్ యార్డు

ఆకివీడు: రైతుల సొమ్ము రాళ్ల పాలు అవుతున్నాయి. కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా ప్రభుత్వాలు రైతులకు కనీస వసతులు సమకూర్చలేకపోతున్నాయి. రైతు పండించిన పంటకు సంబంధించిన ధాన్యం నుంచి మార్కెట్ యార్డుల ద్వారా పన్ను వసూలు చేస్తున్నాయి. ఏఎంసీల ద్వారా ఆదాయం దండిగా ఉన్నప్పటికీ రైతులకు మాత్రం ఆ నిధులు ఒక్క రూపాయి కూడా వినియోగించడం లేదు. ఏళ్ల తరబడి కోట్లాది రూపాయల ఆదాయాన్ని రికార్డుల్లో చూపిస్తున్నా మార్కెట్ యార్డు ఖాతాల్లో (ఖజానా) మాత్రం ఒక్క పైసా నిల్వ ఉండటం లేదు. నియోజకవర్గంలోని ఆకివీడు వ్యవసాయ మార్కెట్ ద్వారా ప్రతి ఏటా రూ.3 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. ఉండి మార్కెట్ యార్డు పరిధిలో ఏడాదికి సుమారు రూ.10 కోట్ల ఆదాయం వస్తుంది. రెండు మార్కెట్ యార్డుల పరిధిలో సుమారు రూ.50 కోట్ల పైబడి నిల్వ ఉన్నప్పటికీ ఒక్క రూపాయి కూడా ఆయా ఖాతాల్లో లేదు. వచ్చిన ఆదాయంలో 45 శాతం జీతాలు, ఇతర భత్యాలకు కేటాయిస్తారు. మిగిలిన సొమ్మును ప్రభుత్వాలు ఇతర అవసరాలకు వినియోగించడంతో రైతు అవసరాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉన్నాయి.

పుంతరోడ్ల అభివృద్ధి హుళక్కే

నియోజకవర్గంలో వందకు పైగా పుంత రోడ్లు ఉన్నాయి. రైతులు ధాన్యం, ఎండుగడ్డి, ఎరువులు, విత్తనాలు ఇతరత్రా తరలించేందుకు పుంత రోడ్ల గుండా ప్రయాణించాల్సి ఉంది. అయితే నాలుగు దశాబ్దాలుగా పుంత రోడ్లకు మోక్షం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో అక్కడక్కడా కొన్ని పుంత రోడ్లకు గ్రావెల్ వేశారు. గత ప్రభుత్వంలో కొన్ని పుంత రోడ్లకు గ్రావెల్, మరమ్మతులు చేపట్టారు. అయితే గ్రామాల్లో రైతులకు అత్యవసరమైన పుంతరోడ్లు బురద మయంగానే మిగిలిపోయాయి. వర్షం వస్తే రైతు కష్టాలు వర్ణనాతీతం. ఎండలు కాస్తే రైతుల ఇబ్బందులు మరీ ఎక్కువే. గుంతల రోడ్లలో ట్రాక్టర్లు, బండ్లు నడపలేక తిరగబడుతున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి.

ప్రతిపాదనలతోనే సరి

పుంత రోడ్ల నిర్మాణానికి గత కొన్నేళ్లుగా మార్కెట్ కమిటీ పాలకవర్గం తీర్మానాలు చేసి ప్రభుత్వాలకు పంపుతున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పుంత రోడ్లు మరీ అధ్వానంగా తయారయ్యాయి. రెండేళ్లకో, మూడేళ్లకో ఒకసారి పుంత రోడ్లకు రూ.5 కోట్లు ఇచ్చామని, ప్రతిపాదనలు పంపాలని కోరడం, వాటిని బుట్టదాఖలు చేయడం పరిపాటిగా మారింది.

అభివృద్ధి అంతంత మాత్రమే

మార్కెట్ యార్డుల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. రైతలకు ఉపయోగ పడే మార్కెట్ యార్డు ప్రాంగణాలు నిరుపయోగంగా ఉన్నాయి. యార్డుల్లో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం, నెట్లు కట్టుకోవడం, నిల్వ పోసుకునేందుకు అవకాశాలుండేవి. ఇటీవల కాలంలో ఆ పరిస్థితి లేకపోవడంతో మార్కెట్ యార్డులు అధ్వానంగా తయారయ్యాయి. చిట్టడవిని తలపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేక రైతులు పలు అవస్థలు పడుతున్నారు. భవనాలు, గోడౌన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి.

పుంత రోడ్లను అభివృద్ధి చేయాలి



రైతులకు ఉపయోగపడే పుంత రోడ్ల నిర్మాణం చేపట్టాలి. బ్రిటీష్ కాలం నాటి మట్టి రోడ్లే చాలా గ్రామాల్లో నేటికీ ఉన్నాయి. పుంత రోడ్ల అభివృద్ధిని ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు. గతంలో వ్యవసాయం నుండి అధికంగా ఏఎంసీలకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం ఆదాయం పెరిగినా సౌకర్యాలు కన్పించడం లేదు.

–మంతెన సునిల్‌కుమార్, రైతు, చెరుకుమిల్లి

కోల్డ్ స్టోరేజీలను నిర్మించాలి



వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఆక్వా రంగం నుంచి అధిక ఆదాయం వస్తుంది. ఏఎంసీల్లో కోల్డ్ స్టోరేజీల నిర్మాణం ద్వారా ఆక్వా రైతులను ఆదుకునే ప్రయత్నం చేయాలి. రొయ్యల ధరలు స్థిరంగా ఉండటం లేదని, ధర తగ్గించి కొనడంతో రైతు నష్టపోతున్నాడు. ధర లభించేంత వరకూ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుకునే సదుపాయం ఉంటుంది.

–వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), ఆక్వా రైతు, చినకాపవరం

పాలీకల్చర్‌ను నిరోధించాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: రొయ్యలు, చేపలను కలిపి చేసే పాలీకల్చర్‌ను పూర్తిగా నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో ఆయన ఆక్వాకల్చర్‌లో యాంటీబయాటిక్స్ టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించి యాంటిబయటిక్స్ నిరోధానికి చేపట్టవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ సదస్సులో జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తుల అమ్మకాల దుకాణాల్లో కమిటీ సభ్యులైన అసిస్టెంట్ డైరెక్టర్ ఫిషరీస్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఫుడ్ సేఫ్టీ అధికారి, ఎంపెడా, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఆక్వా రైతులు ఆక్వా డీలర్లు, సంబంధిత వారందరూ రాష్ట్ర ప్రభుత్వం, ఫిష్ ఆక్వా కల్చర్ అథారిటీలో లైసెన్సులు తప్పనిసరిగా పొందాలని తెలిపారు. సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీవీఎస్ ప్రసాద్, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మనోజ్, జిల్లా ఫుడ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ అన్నపురెడ్డి సుందర రామిరెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు భీమవరం ఆలీ, మల్లికార్జునరావు, ఎఫ్‌డీవోలు, పోలీస్, రెవెన్యూశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ



మంచం మీద నుంచి లేవలేని పింఛన్‌దారులను పరిశీలిస్తున్న వైద్య బృందం

పాలకోడేరు: మండలంలోని అన్ని గ్రామాల్లో మంచం మీద ఉండి లేవలేని పరిస్థితితో ప్రభుత్వం అందిస్తున్న రూ.15000 పింఛన్ తీసుకుంటున్న వారిపై బృందం సోమవారం ఆరా తీసింది. వారు నిజమైన అర్హులేనా, అడ్డదారిలో పింఛన్ తీసుకుంటున్నారా వారి దగ్గర ఉన్న రిపోర్టులను పరిశీలించారు. అనంతరం అక్కడికక్కడే వారి పరిస్థితిని ఆన్లైన్లో అప్లోడ్ చేశారు. మండలంలోని పాలకోడేరు, కుముదవల్లి, మోగల్లు, వేండ్ర గ్రామాల్లో ప్రత్యేక వైద్య బృందం సభ్యులైన డాక్టర్ సుభాష్, డాక్టర్ ఆనంద్ స్వరూప్, పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రంగం నాయుడు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రెడ్డియ్య వైద్య బృందం చేస్తున్న సమీక్షను పరిశీలించారు.

23, 24 తేదీల్లో పింఛన్ల తనిఖీ

ఉండి: ఈ నెల 23, 24 తేదీల్లో మండలంలోని బెడ్ రిడెన్ రోగులు ప్రభుత్వం నుంచి పొందుతున్న రూ.15 వేల పింఛన్లను తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. ప్రభుత్వం నియమించిన ప్రాంతం నుంచి నిపుణులైన వైద్య బృందం ఆధ్వర్యంలో రోగులను పరీక్షిస్తారని తెలిపారు. మండలంలోని 19 గ్రామాల పరిధిలో సుమారు 9700 పింఛన్లు ఉండగా వాటిలో 49 మాత్రమే బెడ్‌రిడెన్ పింఛన్లు ఉన్నాయి. వాటిని పరిశీలించి నివేదికను డాక్టర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. అలాగే దివ్యాంగులకు అందించే రూ.6 వేల పింఛన్లు మండల వ్యాప్తంగా 936 ఉన్నాయని వాటిని కూడా త్వరలోనే తనిఖీ చేస్తారని ఎంపీడీవో తెలిపారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న దాతలు

ఆకివీడు: వృద్ధులను చూడాల్సిన బాధ్యత వారి పిల్లలదేనని వృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు రామ్‌కుమార్ చెప్పారు. స్థానిక లయన్స్ కార్యాలయం వద్ద దాత డాక్టర్ ఎండీ బిలాల్ ఆర్థిక సాయంతో 120 మంది వృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణకు ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందన్నారు. పిల్లలకు ఆస్తి రాసే సమయంలో తదనంతరం అని రాసినా, రాయకపోయినా వృద్ధులను పట్టించుకోకపోతే ఆస్తి పిల్లలకు చెందకుండా ప్రభుత్వం వృద్ధులకే చెందే విధంగా చట్టం రూపొందించిందన్నారు. వృద్ధుల సంఘం గౌరవాధ్యక్షుడు, లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ డాక్టర్ ఎంవీ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఆకివీడులో సంఘం ఏర్పాటు చేసిన దగ్గర నుంచి వృద్ధుల సంక్షేమానికి నిరంతరం సేవలందిస్తున్నామన్నారు. సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య మాట్లాడుతూ 105 కార్యక్రమాల ద్వారా పేదలకు ఎనిమిది వేల దుప్పట్లు, ఆరు వేల చీరలు పంపిణీ చేశామన్నారు. సుమారు రూ.27 లక్షల విలువైన వస్తువులు, భోజన వసతి కల్పించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో దాత ఎండీ. బిలాల్, ఎండీ.జక్కి, అప్పిరెడ్డి, గొంట్లా సత్యనారాయణ, తోట రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవాణాశాఖ అధికారులు

ఉండి: వాహనాలు నడిపే డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని ఆర్‌టీఓలు కేఎస్ఎన్ ప్రసాద్, సీహెచ్ వెంకటరమణ అన్నారు. సోమవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో ఉండి ఏఎంసీలో ఆటో డ్రైవర్లు, గూడ్స్ వాహనాలు, కాలేజ్ బస్సు డ్రైవర్లకు జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు. అలాగే ఫోన్ మాట్లాడటం వలన అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని డ్రైవింగ్ చేస్తున్న సమయంలో ఫోన్ మాట్లాడకూడదని తెలిపారు. అధిక లోడుతో వాహనాలు నడిపేందుకు ప్రయత్నించొద్దన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.రవికుమార్, ఎస్ఎల్ఎస్ లక్ష్మీ, ఏఎస్ ఫణి మాట్లాడుతూ ఆటోలు నడిపే సమయంలో డ్రైవర్‌కు ఇరువైపులా ప్యాసింజర్లను ఎక్కించుకుంటున్నారని అలా చేయడం వల్ల హ్యాండిల్ సరిగ్గా తిరుగకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సూచించారు. భీమవరం ట్రాఫిక్ సీఐ వి.నారాయణమూర్తి మాట్లాడుతూ స్కూల్ బస్సు డ్రైవర్లు కాలేజ్ ప్రాంగణంలోనూ, నియమిత ప్రాంతాల్లోనూ మాత్రమే స్టూడెంట్లను బస్సు ఎక్కించుకోవడం, దించడం చేయాలని మధ్య, మధ్యలో బస్సు ఆపడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటాయని సూచించారు. అలాగే బస్సు డ్రైవర్లు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా పాల్గొని డ్రైవర్లు, వాహనదారులు పలు సూచనలు సలహాలు అందజేశారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత పశు వైద్య శిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పశు పోషకులను కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం మీకోసం సమావేశ మందిరంలో ఉచిత పశువైద్య శిబిరాల గోడ పత్రికను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువైద్య శిబిరాలు సోమవారం ప్రారంభించామని, ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఉచిత పశు వైద్య శిబిరాల్లో పశువులకు గర్భ కోశ వ్యాధుల చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందుల పంపిణీ, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై దోసి రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, వేణుగోపాల్, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భీమవరం: గ్రామాల్లో సైతం పశువుల పెంపకం తగ్గుతున్న పరిస్థితుల్లో ప్రత్యేకంగా పశు పెంపకం చేపట్టాల్సిన అవశ్యకత ఏర్పడిందని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉచిత పశు వైద్య శిబిరాల పోస్టర్లు ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 31వ తేదీ వరకు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తారని నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు వేస్తారన్నారు. పశు వైద్య శిబిరాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని అంజిబాబు కోరారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏరియా సహాయ సంచాలకుడు డాక్టర్ సుధీర్‌బాబు, గూట్లపాడు పశు వైద్య అధికారి డాక్టర్ పుండరీబాబు, వెంప పశు వైద్యాధికారి డాక్టర్ మౌర్య సత్యేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

భీమవరం: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ సమావేశం సోమవారం భీమవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరం డివిజన్‌లో 72 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని ప్రోగ్రాం ఆఫీసర్లు విధిగా సెంటర్లను తనిఖీ చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి తనిఖీ చేసి విధివిధానాలు ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అనుమానిత స్కాన్ సెంటర్లలో పోలీసుల సహకారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. డాక్టర్ సీహెచ్ ధనలక్ష్మి, కె.సత్యదేవి, వన్ టౌన్ సీఐ నాగరాజు, పి.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

బెల్ట్ షాపులతో గీత వృత్తికి చేటు

నరసాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి సందులో బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడంతో గీత వృత్తి సర్వనాశనమైందని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొక్కా చంటి ఆరోపించారు. సోమవారం స్థానిక మీరా గ్రంథాలయ భవనంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదన్నారు. బెల్ట్ షాపుల వల్ల గీత కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు పడిన కార్మికుడికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, 50 ఏళ్లు పైబడిన కార్మికులకు పింఛన్లు, ప్రతి గీత కార్మికుడికీ సబ్సిడీపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని కోరారు. నరసాపురం డివిజన్‌లో బెల్ట్ షాపులు అరికట్టకపోతే కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బొక్కా సోమేశ్వరరావు, బండి పోలేశ్వరరావు, దొంగ వెంకటేశ్వర్లు, ఇర్రింకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని నమోదు చేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్, జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు సి.నాగరాణి సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఒక లక్ష రూపాయల కంటే ఎక్కువగా సభ్యత్వ రుసుమును సేకరించిన తణుకు తహసీల్దార్, తాడేపల్లిగూడెం మున్సిపల్ కమీషనర్‌లను జిల్లా కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ద్వారా సేకరించిన నిధులను సమాజ సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్నారు. ముఖ్యంగా వరదలు, అగ్ని ప్రమాద బాధితుల సహాయానికి, రక్తదాన కేంద్రాల అభివృద్ధికి, ఇతర మానవతా కార్యక్రమాలకు వినియోగిస్తామన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులు ఎక్కువ మొత్తంలో రెడ్‌క్రాస్ సభ్యత్వాన్ని ప్రోత్సహించి, నిధులను సమీకరించాలని సూచించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అత్యధిక సభ్యత్వ నమోదు ద్వారా రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

పోడూరు: కుష్ఠు వ్యాధి లక్షణాలుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డి.సుప్రజ సూచించారు. పోడూరులో సోమవారం కుష్ఠు నివారణలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుష్ఠు లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, అరచేతులు, అరికాళ్లు స్పర్శ లేకపోవడం, చెవులపై, వీపుపై, చాతీపై, నొప్పిలేని బొడిపెలు రావడం, చల్లని, లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం వంటివి కుష్ఠు లక్షణాలని వివరించారు. ఫిబ్రవరి 2వ తేదీ వరకు గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు.

8 నుంచి పెనూయేలు సభలు

ఉండి: వచ్చే నెల ఎనిమిదో తేదీ శనివారం రాత్రి నుంచి పదో తేదీ సోమవారం రాత్రి వరకు పెనూయేలు ప్రేయర్ మినిస్ట్రీస్ 20వ వార్షికోత్సవ యేసుక్రీస్తు సువార్త మహాసభలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఈదా విజయప్రసాద్, సునీత తెలిపారు. ఉండి బస్టాండ్ ఎదురుగా పెన్నాడ శ్రీనివాస్ స్థలంలో (ఎస్వీఆర్ ఎస్టేట్స్‌లో) ప్రతీ ఏటా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మహాసభలు ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సభలకు ముఖ్య అతిథిగా బ్రదర్ జాన్సన్ మేడిద హాజరవుతున్నట్లు తెలిపారు. వాక్యోపదేశకులుగా పాస్టర్ టి.జఫన్యాశాస్త్రి (విశాఖపట్నం), బ్రదర్ మాథ్యూస్(గుంటూరు), పాస్టర్ జార్జ్‌బుష్ (ఉయ్యూరు) హాజరవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రఖ్యాత క్రైస్తవ సంగీత దర్శకుడు జోనా టీమ్ (నర్సాపురం)ఆధ్వర్యంలో అద్భుత స్తుతిఆరాధన, క్రైస్తవ గీతాలు ఆలపిస్తారన్నారు. ఉండి పరిసర ప్రాంతాల విశ్వాసులు ఈ సభల్లో పాల్గొనాలని పాస్టర్ విజయ్‌ప్రసాద్ తెలిపారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

భీమవరం: సమస్యల పరిష్కారానికి రైతు సంఘాల నాయకుడు జగత్ సింగ్ దల్లెవాల్ 58 రోజులుగా ఢిల్లీలో చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భీమవరంలో సోమవారం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు చింతకాయల బాబురావు, లంక కృష్ణమూర్తి, ఆనంద్, దండు శ్రీనివాసరాజు, సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటిస్తామని, రైతాంగ సమస్యలు పరిష్కరిస్తామని 2021 డిసెంబర్ 9న రాతపూర్వకంగా అంగీకార పత్రం ఇచ్చినా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కేంద్రం ఇచ్చిన హామీని అమలు చేయాలని లేకుంటే ఆమరణ దీక్ష చేస్తున్న జగత్‌సింగ్ దల్లెవాల్ ప్రాణానికి ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు: విద్యుత్ ఉపకేంద్రం వద్ద మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున పాలకోడేరు, గొల్లలకోడేరు, గరగపర్రు, కుము దవల్లి, మోగల్లు, వేండ్ర, వేండ్ర అగ్రహారం, గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

వీరవాసరం: అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కె.బలరామరాజు సోమవారం తెలిపారు. వీరవాసరం మండలం బలుసు గొయ్యలపాలెం గ్రామానికి చెందిన ఇళ్ల నాగ సత్యనారాయణ అక్రమ మద్యం అమ్ముతుండగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడి నుంచి ఏడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎక్సైజ్ ఎస్సైలు సునీల్ కుమార్, ఉమా మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 4 ఫిర్యాదులు

ఆకివీడు: ప్రజా పరిష్కార వేదికకు నాలుగు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ సుహాసిని సోమవారం తెలిపారు. రుద్రయ్యకోడు మురుగు కాల్వగట్లపై ఉన్న ఇళ్లు తొలగింపు సమస్య నివారణ చేపట్టాలని అజ్జమూరు గ్రామానికి చెందిన వర్ధినేని వెంకటరత్నం ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. 2023 ఆగస్టు ఒకటో తేదీన తన ఇంట్లో జరిగిన దొంగతనం కేసులో దొంగ దొరికినప్పటికీ ఎత్తుకెళ్లిన బంగారు ఆభరణాలు, నగదు తనకు ఇవ్వలేదని స్థానిక వెలంపేటకు చెందిన జామిశెట్టి దుర్గ ఫిర్యాదు చేశారన్నారు. అయిభీమవరం గ్రామంలోని సర్వే నంబర్ 52-1డీలోని తన స్థలంలో ఉన్న తాడి చెట్లను కొట్టుకుపోయారని గత ఏడాది డిసెంబర్ 19న ఫిర్యాదు చేసినా ఇంత వరకూ చర్యలు తీసుకోలేదని, గతంలో మీ కోసంలో ఫిర్యాదు చేసినా ఇంత వరకూ చర్యలు చేపట్టలేదని కనుమూరు సత్యనారాయణరాజు ఫిర్యాదు చేశారని ఎంపీడీఓ చెప్పారు. స్థానిక పెదపేటలోని 2.80 ఎకరాల సీబీసీఎన్‌సీకి చెందిన భూమిని సరే చేసి, హద్దులు చూపించాలని జి.జోసఫ్‌రాజు అర్జీ సమర్పించారన్నారు. కార్యక్రమంలో పలు శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.